## క్లుప్తంగా

### వైభవంగా రావులమ్మ తీర్థం



రావులమ్మ అమ్మవారు

**అంబాజీపేట:** గంగలకుర్రులో వేంచేసియున్న రావులమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి గ్రామ ఆడపడుచులు ముడుపులు, మొక్కులు, కానుకలు, చలివిడి పానకాలు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా జరిపారు.

### నేడు ఆసరా చెక్కుల పంపిణీ

**అంబాజీపేట:** వైఎస్సార్ ఆసరా చెక్కులను అంబాజీపేట మార్కెట్ యార్డు ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొననున్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

### పాళ్లమ్మకు గరగ సమర్పణ



కమిటీ చైర్మన్‌కు గరగను అందజేస్తున్న సాయికుమార్ దంపతులు

**మామిడికుదురు:** ఈదరాడ గ్రామ దేవత పాళ్లమ్మకు కొమరాడకు చెందిన కొడమంచిలి సాయికుమార్, దుర్గాదేవి దంపతులు నాలుగు కిలోల ఇత్తడి గరగ సమర్పించారు. దీన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తికి అందించారు. దాతను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో కటికిరెడ్డి వరబాబు, కె.భరత్‌కుమార్, చేట్ల సత్యనారాయణ, బొంతు సుధాకర్, యెరుబండి రాజీవ్ పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించాలి

**అంబాజీపేట:** ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట శివారు మెట్ల రాంజీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న బాత్‌రూమ్‌ల భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ నాడు నేడు రెండో విడతలో మంజూరైన రూ.5 లక్షలతో విద్యార్థులకు అవసరమైన బాత్‌రూమ్‌లను నిర్మిస్తున్నామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గోసంగి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్‌లు కుడుపూడి సతీష్, పితాని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు నిత్యావసరాల పంపిణీ



పేదలకు నిత్యావసరాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**రావులపాలెం:** పేదలకు సత్యసొధ ఫౌండేషన్ తరఫున మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేసినట్టు సంస్థ వైస్ చైర్మన్ చెల్లుబోయిన సూర్యనారాయణ తెలిపారు. గ్రామంలోని కొత్త కాలనీకి చెందిన ఆకుల పోశియ్య కుటుంబానికి, అదే విధంగా రావులపాడు గ్రామానికి చెందిన చింతపల్లి సత్య గౌరీ కుటుంబ సభ్యులకు రెండో నెల 21 రకాల సరకులను అందించారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ సెక్రటరీ చెల్లుబోయిన సుగుణ, పీఆర్ఓ పట్నాల శ్రీనివాస్, టీం సభ్యులు తెల్లాకుల వీర పావని, అనసూరి భవాని, ఇళ్ళ మహిమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్ఎంఎంఎస్‌కు 8 మంది విద్యార్థుల ఎంపిక

**కొత్తపేట:** కేంద్ర ప్రభుత్వ నేషనల్ మీన్స్ అండ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో మండలంలో 3 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ మంగళవారం సాయంత్రం తెలిపారు. వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఏకంగా ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వారిలో బళ్ల వాణీ శ్రీవిద్య, కొమ్ముల వెంకటసాయిమణికంఠ, పిల్లి లక్ష్మీప్రణవ్య, సత్యాల తరుణ్, వనుముశెట్టి ఎస్ఎస్ ప్రణతి ఉన్నారు. బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి దొండపూడి దిలీప్, యండమూరి సాయిశిశిర, వానపల్లి శివారు తొత్తుపాడు ఉన్నత పాఠశాల నుంచి మేట్రపర్తి సురేంద్ర ఎంపికయ్యారని ఎంఈఓ హరిప్రసాద్ తెలిపారు. ఆ విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అభినందించారు.

# జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట



ఆత్రేయపురంలో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ముక్తేశ్వరంలో మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



కత్తిమండలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- పలు నియోజకవర్గాల్లో ఆసరా చెక్కుల పంపిణీ
- పాల్గొన్న ఆయా ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు, వరప్రసాదరావు

**ఆత్రేయపురం:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని, ఆయన ఇచ్చిన హామీల్లో 98.5 శాతం నెరవేర్చారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్రేయపురం మహారాజా ప్యాలెస్ వద్ద వైఎస్సార్ ఆసరా పథకం చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు మూడు విడతలుగా 62,534 మంది అక్కచెల్లెమ్మలకు రూ.164.53 కోట్లు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ పథకం ద్వారా ఆత్రేయపురం మండలంలో 1355 సంఘాల్లో ఉన్న 13567 మంది మహిళలకు రూ.10.20 కోట్ల చెక్కును మహిళా సమైఖ్య ప్రతినిధులు మట్టా అనంతలక్ష్మి, నరుకుల సీత మహిళలకు అందజేశారు. వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన సొమ్మును మహిళలు ఆర్థిక స్వావలంబన, జీవనోపాధికి ఉపయోగించుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని జగ్గిరెడ్డి ఆకాంక్షించారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఆసరా అందని గ్రూపుల విషయం సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారికి కూడా త్వరలోనే నగదు జమ చేయడానికి ఉన్నతాధికారులకు ఆదేశించినట్లు వివరించారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, సీనియర్ పార్టీ నాయకులు కొల్లి శ్యామ్‌సన్, సర్పంచ్‌లు పోచిరాజు బాబురావు, పాలా నాగేశ్వరరావు, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళల అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే చిట్టిబాబు**

**అయినవిల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. మూడో దఫా వైఎస్సార్ ఆసరా ద్వారా 1370 సంఘాలకు రూ.10.98 కోట్లు మహిళా సంఘాలకు అందజేశారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, ఏపీఎం మాదే దుర్గ, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పి.దుర్గ, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చినబాబు, మహిళా ప్రజా ప్రతినిధులు వార జయసావిత్రి, దాసరి శైలజ, కుసుమ లిల్లీ మంగేష్కర్ తదితరులు పాల్గొన్నారు.

**దేశ ప్రజలు మెచ్చేలా సీఎం జగన్ పాలన: ఎమ్మెల్యే రాపాక**

**మలికిపురం:** దేశ ప్రజలు మెచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కత్తిమండ క్యాంపు కార్యాలయ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అలాగే మహిళలకు రూ.110.35 కోట్ల నమూనా చెక్కు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించే ధైర్యం ప్రతి పక్షాలకు లేదన్నారు. గత ప్రభుత్వాలు విద్య, వైద్యం పేరుతో ప్రజలను దోచుకుని వారి ఆస్తులను పెంచుకున్నారని అన్నారు. అందరినీ ఒకే విధంగా చూస్తూ పరిపాలన సాగిస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో కూడా సీఎంగా గెలిపించుకుందామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల కాశి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, ఎంపీపీ వీరా మల్లిబాబు, పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి, సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, చెల్లుబోయిన శేషవేణి, నల్లి విజయకుమారి, సుందర బ్రహ్మయ్య, కాకర శ్రీనివాస్, ఎంపీటీసీలు చిట్టాల శ్రీనివాస్, నల్లి అంజనా దేవి తదితరులు పాల్గొన్నారు.

### సత్తెమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**రావులపాలెం:** మండలంలోని గోపాలపురం రజకుల సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### కిడ్నీవ్యాధి గ్రస్తుడికి ఎమ్మెల్యే సాయం

**రావులపాలెం:** గ్రామానికి చెందిన రాజమండ్రి మణికంఠ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బాధితుడిని మంగళవారం పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 7, 8 తేదీల్లో అంతర్వేదిలో దీక్షా మాలధారణ

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఏప్రిల్ 7, 8 తేదీల్లో 27 రోజుల పాటు చేపట్టే భక్తుల స్వామివారి దీక్షా మాలధారణ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం అన్నారు. దేవస్థానం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అలాగే ఆలయంలో దీక్షా విరమణ కార్యక్రమం నృసింహుని జయంతి రోజైన మే 4న ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వామి మాలధారణ చేపట్టాలనుకునే భక్తులు ఆలయంలో సంప్రదించాలని కోరారు. స్వామివారి దీక్షా మాలధారణ ధరించి స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన సూచించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

### రావులపాలెం తహసీల్దార్‌గా మృత్యుంజయరావు



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బండి మృత్యుంజయరావును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**రావులపాలెం:** మండల తహసీల్దారుగా బండి మృత్యుంజయరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన వీవీవీ సత్యనారాయణకు కాట్రేనికోన బదిలీ కావడంతో ఆ స్థానంలోకి కాట్రేనికోన నుంచి మృత్యుంజయరావు బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### విద్యార్థి వెస్లీకి అభినందనలు

**సఖినేటిపల్లి:** అంతర్వేదిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి నల్లి ప్రిన్స్ వెస్లీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వెస్లీని ఘనంగా సత్కరించారు. అలాగే ఇందుకు ప్రోత్సహించిన తండ్రి శుభాకర్‌ను వారు అభినందించారు. ఈ మేరకు సర్పంచ్ నల్లి లీలావతి, ఎంపీటీసీ మందపాటి రత్నం ఈ సత్కారం చేశారు.

## లోప రహితంగా ఉపాధి పనులు



కొత్తపేట సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గంగాధరరావు

**కొత్తపేట:** జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఏమైనా చిన్న చిన్న లోపాలుంటే వాటిని సరిచేసుకుని భవిష్యత్‌లో చేపట్టే పనుల్లో ఆ లోపాలకు తావు లేకుండా చేపట్టాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ గంగాధరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ పాల్గొన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకూ మండలంలోని పది గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ శాఖలకు సంబంధించి 280 పనులు చేపట్టగా వేతనాల రూపంలో రూ.6,78,00,139, మెటీరియల్ రూపంలో రూ.3,01,60,139 తో మొత్తం రూ.9,79,60,846 ఖర్చు చేశారు. ఆయా పనులపై గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్స్ (వీఎస్ఏ) తనిఖీలు జరిపి, నివేదికలు రూపొందించారు. సర్వే నివేదికలపై ప్రజావేదికలో పీడీ మధుసూదన్ గ్రామాల వారీగా సమీక్షించారు. వివిధ పనుల్లో పలు లోపాలను గుర్తించారు. వాటిలో ఉపాధి పథకానికి సంబంధించి రూ.3,886, పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.5,10,226 రికవరీ చేయాలని సూచించారు. ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, మోడేకుర్రు, ఖండ్రిగ వీడీపీ కన్వీనర్లు కుడుపూడి వెంకటేశ్వరరావు, దూనబోయిన శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు దూళి సూరిబాబు, షేక్ బడేమియా, హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్, పంచాయతీ సభ్యుడు బొక్కా లోకేష్, డ్వామా ఏపీడీలు సత్యనారాయణ, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మరలా పట్టం కట్టేది జగన్‌మోహన్‌రెడ్డికే..



అయినవిల్లిలో లబ్ధిదారుడికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

**అయినవిల్లి:** రాష్ట్ర ప్రజలు మరలా పట్టం కట్టేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డికేనని స్పష్టమవుతోందని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే చిట్టిబాబు అయినవిల్లిలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలు తీరును నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టిబాబు వారికి హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. డ్రెయినేజీ, రహదారులు, వాటర్ పైపులైన్ నిర్మాణం వంటి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అలాగే ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నెరవేరుస్తామన్నారు. వరదల వల్ల నష్టపోయిన వారిని ప్రభుత్వం పార్టీలకు అతీతంగా ఆదుకుంటుందన్నారు. వరదల్లో ఓ ఒక్క ప్రభుత్వం చేయని అనేక సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలు తెలిసిన మహామనిషి అని అన్నారు. ప్రతిపక్షాలు విమర్శించేందుకు వీలులేనట్లుగా రాష్ట్ర పాలన కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, మట్టపర్తి వెంకటరమణ, బొంతు రాజేంద్రప్రసాద్, బొర్రాపాలేపు సత్యనారాయణ, బడుగు దుర్గాదేవి, విళ్ల శుభాకర్, పేరిచర్ల గణపతిరాజు, పులిదిండి ప్రభాకర్, కొనే చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సహకార బ్యాంకును విడదీయాలి



డీసీసీబీ చైర్మన్ వీర్రాజుకు వినతిపత్రం ఇస్తున్న కోనసీమకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు

**మామిడికుదురు:** కొత్త జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కాకినాడలో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకును విడదీసి దాన్ని అమలాపురంలో ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు పీఏసీఎస్ చైర్మన్లు మంగళవారం డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, సీఈఓ నరసింహారావుకు వినతిపత్రం ఇచ్చారు. కాకినాడలో జరిగిన మహాజన సభలో ఈ విజ్ఞాపన పత్రం అందించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, గెద్దం కృష్ణమూర్తి, కూనపరెడ్డి రాంబాబు, యూవీవీ సత్యనారాయణ, యెనుముల నారాయణస్వామి, బొలిశెట్టి భగవాన్ ఈ వినతిపత్రం అందించారు. పూర్వపు తూర్పుగోదావరి జిల్లాను మూడు జిల్లాలుగా విభజించిన విధంగానే కాకినాడలో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకును కూడా విడదీసి, దాన్ని కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో పాటు రైతులకు మరింత చేయూత నందించే దిశగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకును అభివృద్ధి చేయాలని కోరారు. దీనికి డీసీసీబీ చైర్మన్ వీర్రాజు సానుకూలంగా స్పందించారని చైర్మన్లు తెలిపారు.

## కొబ్బరిలో తెగుళ్ల నివారణపై అవగాహన ఉండాలి



అంబాజీపేటలో క్షేత్రస్థాయిలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాసులు

**అంబాజీపేట:** కొబ్బరి తోటలను ఆశించే నష్టపరుస్తున్న తెగుళ్లు, కీటకాల నివారణపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో కొబ్బరిలో క్షేత్రప్రదర్శన కార్యక్రమాన్ని అధిపతి శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కీటక సమస్యలలో ప్రధానంగా కొమ్ముపురుగు, ఎర్రముక్కు పురుగు నివారణకు జీవ శిలీంద్రాలైన ట్రైకోడెర్మా, సూడోమోనాస్, వేపపిండి వినియోగించాలన్నారు. తెల్లదోమ నివారణకు బదనికలను ఉపయోగిస్తూ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు మాట్లాడుతూ కొబ్బరిలో ఉప ఉత్పత్తుల తయారీకి రైతులు ఆసక్తి చూపించాలన్నారు. అందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరిలో ఆశించే గ్రానోడెర్మా, నల్లముట్టి తెగుళ్లను గమనించి రైతులు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన విభాగం శాస్త్రవేత్త ఎ.కిరీటి, శాస్త్రవేత్తలు బి.నీరజ, రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావులు రైతులకు క్షేత్రస్థాయిలో కొబ్బరిలో ఎరువులను వేయడం, తెగుళ్లను అరికట్టడానికి జీవశిలీంద్రాలను వినియోగించడం, తెల్లదోమ, వివిధ కీటకాలను బదనికల ద్వారా నివారించడంపై రైతులకు క్షేత్రప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో ఎరువుల యాజమాన్యంపై వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఉప్పుగంటి భాస్కరరావు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవ ఏర్పాట్ల పరిశీలన



వాడపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో ముక్కంటి తదితరులు

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 31 నుంచి వారం రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం ఆర్డీవో ఎం.ముక్కంటి, రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్‌తో పాటు కొత్తపేట నియోజకవర్గం అధికార బృందం ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజుతో కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆలయంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్సై సీహెచ్ సుధాకర్, పొడగట్లపల్లి ఈవో రాధాకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వశిష్టపై వంతెన నిర్మాణ స్థలాలను పరిశీలించి ఆర్డీఓ

**పి.గన్నవరం:** వశిష్ట నదీపాయ మధ్యలో ఉన్న ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల సౌకర్యార్థం రూ.49.5 కోట్లతో మంజూరైన వంతెనను సాంకేతికంగా అనువైన ప్రాంతంలో నిర్మిస్తామని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి అన్నారు. ఇటీవల లంక గ్రామాల్లో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వంతెనను త్వరలో నిర్మిస్తామని, హామీ ఇచ్చి దానికి అన్ని అనుమతులను మంజూరు చేసిన విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో మంగళవారం ఆర్డీఓ ముక్కంటి, తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబు, విశ్రాంత పీఆర్ డీఈఈ పీవీఎంబీ ప్రసాదరావు, ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులు వంతెన నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. అధికారులు నిర్ధారించిన ప్రాంతంతో పాటు ఉచ్చులవారిపేట, చింతావారిపేట మధ్యలో వంతెన నిర్మించాలని ఆయా ప్రాంత ప్రజలు కోరుతున్న ప్రదేశాలను ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆర్డీఓ కోరారు. దీనిపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆర్డీఓ ముక్కంటి వివరించారు.

ఊడిమూడి శివారు చింతావారిపేట, ఉచ్చులవారిపేట మధ్యలో ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మించి, అక్కడి నుంచి నదీపాయపై లంకలోకి వంతెన నిర్మించాలని స్థానికులు ఆందోళన నిర్వహించారు. ప్రధాన పంట కాలువపై వంతెన లేక రెండు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, స్థానిక నాయకుడు సాధనాల రమేష్‌లు ఆర్డీఓ ముక్కంటికి వివరించారు. దీంతో అధికారులు గ్రామస్తులతో చర్చించారు. సాంకేతికంగా ఇబ్బందులు లేకుండా, ప్రజలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా రవిశంకర్ శ్రీనివాస్



నియామక ఉత్తర్వులను అందుకుంటున్న శ్రీనివాస్

**రావులపాలెం:** కొత్తపేట బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన న్యాయవాది ర్యాలీ రవిశంకర్ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఈ మేరకు నియామక ఉత్తర్వులను బార్ అసోసియేషన్ ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు నుంచి అందుకున్నట్టు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

### నృత్యాలతో అలరించిన విద్యార్థులు



మామిడికుదురు ఉన్నత పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

**మామిడికుదురు:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంతో పాటు పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ మంగళవారం కోలాహలంగా జరిగింది. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ప్యాడ్లు, పెన్నులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ మట్టా వెంకటేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**కొత్తపేట:** మండలంలోని అవిడి గ్రామ పంచాయతీ వద్ద వేసవి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ రెడ్డి చంటి ప్రారంభించారు. ఈ వేసవికాలం సీజన్ అంతా ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం నిర్వహించనున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దూళి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు చర్యలు

**అంబాజీపేట:** గ్రామీణ ప్రాంతాల్లోని శివారు ప్రాంతాల అభివృద్ధికి, రహదారులకు, శ్మశాన వాటికల వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో అపరిష్కృతంగా ఉన్న శ్మశాన వాటికకు వెళ్లే రహదారి నిర్మాణానికి సర్పంచ్ రేవతి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి పెదబాబులు మంగళవారం భూమి పూజ చేశారు. శ్మశాన వాటికకు వెళ్లేందుకు, అక్కడ కర్మకాండలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదేశాల మేరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారా నాగవేణి, కొప్పిశెట్టి శ్రీనివాస్, ముక్కామల ముత్యాలు, పినిపే మోహన్, నేదునూరి కల్యాణ్ పాల్గొన్నారు.

### బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా సత్తిబాబు

**ఆలమూరు:** మండలంలోని జొన్నాడకు చెందిన అయినవిల్లి సత్తిబాబుగౌడ్‌ను కొత్తపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా రాష్ట్ర బీజేపీ శాఖ నియమించింది. నియోజకవర్గంలో బీజేపీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని కన్వీనర్ సత్తిబాబు గౌడ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్‌గా ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రశాఖ అధ్యక్షుడు సోము వీర్రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



